క్లుప్తంగా

10 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

గండేడ్‌: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో కొలువుదీరిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10న ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులపాటు కొనసాగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఈఓ ప్రసాద్‌, పూజారి వెంకటేశ్‌ తెలిపారు. 10న విశ్వక్సేన పూజ, 11న శకటోత్సవం, ఎదుర్కోళ్లు, ప్రభోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 12న ఉదయం 11:45 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, రాత్రికి రథోత్సవం ఉంటుందని తెలిపారు. 13న దీపోత్సవం, 14న బాలభోగం, వసంతోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

8 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

జంగంరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల పునర్నిర్మించిన దేవాలయంలో ఈ నెల 8న గణపతి, ఆంజనేయస్వామి విగ్రహాలతో పాటు నవగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా బొడ్రాయి, పోచమ్మ, నాగుల విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భూత్పూర్‌: మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌ గౌడ్‌, మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని 2, 4, 5, 9, 10 వార్డులతో పాటు మండలంలోని పోతులమడుగు, కప్పెట, మొల్గర, మద్దిగట్ల, కర్వెన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు



మహమ్మదాబాద్‌: పోలీసు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తేనే గుర్తింపు ఉంటుందని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి అన్నారు. మహమ్మదాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ ఆజంఅలీ ఎస్‌ఐగా పదోన్నతి పొంది.. నాగర్‌కర్నూల్‌ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఆజంఅలీని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్‌ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు, పూర్తి బయోడేటాతో జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ. 15వేల వేతనం అందుతుందని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన యాదమ్మ, స్వామి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ నర్సింహాచారి గురువారం మృతుల కుటుంబాలను పరామర్శించి రూ. 5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు సుధాకరాచారి, అంజయ్య, నిరంజన్‌, వెంకటేష్‌, రమేష్‌ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

మహమ్మదాబాద్‌: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గండేడ్‌ మండలంలోని రంగారెడ్డిపల్లి వాగు నుంచి కేశవులు అనే వ్యక్తి ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా.. పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ట్రాక్టర్‌ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అడ్డాకుల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన అడ్డాకుల శివారులోని 44వ నంబర్‌ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్‌ వివరాల మేరకు.. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజకు చెందిన అమర్‌నాథ్‌ కారులో హైదరాబాద్‌ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. అడ్డాకుల శివారులో వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో అమర్‌నాథ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతా నా ఇష్టం!



సెట్విన్‌ సెంటర్‌ ఏర్పాటుకు నిర్ణయించిన భవనం ఇదే..

- అనుమతి లేకుండానే ప్రభుత్వ భవనం ఆవరణలోని మరుగుదొడ్ల కూల్చివేత
- మళ్లీ నిర్మించాలంటే రూ. లక్షలు కావాల్సిందే..
- అధికార పార్టీ నాయకుడి నిర్వాకంతో ప్రజాధనం నేలపాలు



భవనం ఆవరణలో నేలమట్టమైన మరుగుదొడ్లు

జడ్చర్ల: మున్సిపాలిటీలోని జాఫీనగర్‌లో ఉన్న ప్రభుత్వ భవనం ఆవరణలోని మరుగుదొడ్లను అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఎలాంటి అనుమతులు లేకుండా కూల్చివేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ భవనంలో తెలంగాణ గురుకుల విద్యార్థుల సంక్షేమ కేంద్రం, ఏకలవ్య వసతిగృహాలు గతంలో కొనసాగాయి. అయితే వాటికి సొంత భవనాలు నిర్మించడంతో వారు ఈ భవనాన్ని ఖాళీ చేశారు. అప్పటి నుంచి నిరుపయోగంగా ఉంది. అయితే గతేడాది ఈ భవనంలో నిరుద్యోగ యువతకు వృత్తి శిక్షణ ఇచ్చేందుకు వీలుగా సొసైటీ ఫర్‌ ఎంప్లాయిమెంట్‌ ప్రమోషన్‌ అండ్‌ ట్రెనింగ్‌ ఇన్‌ ట్విన్‌ సిటీస్‌ (సెట్విన్‌) కేంద్రం ఏర్పాటు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చర్యలు చేపట్టారు. అందులో భాగంగా భవనంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్‌ అధికారులకు సూచించారు. ఈ మేరకు మౌలిక వసతుల పనులు చేపట్టేందుకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలను తయారుచేసి ఎమ్మెల్యేకు నివేదించారు. అయితే భవనంలో మౌలిక వసతులను కల్పించడం అటుంచి.. ఇటీవల కొందరు ఉన్న వసతులను కనుమరుగు చేస్తున్నారు. ఇక్కడ అందుబాటులో దాదాపు 20 మరుగుదొడ్లను నేలమట్టం చేశారు. మళ్లీ ఇక్కడ మరుగుదొడ్లు నిర్మించాలంటే రూ. లక్షల ప్రజాధనం ఖర్చు చేయాల్సిందే. అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ నిధులు దుర్వినియోగయ్యే దుస్థితి నెలకొంది.

అనుమతులు ఇవ్వలేదు..



ప్రభుత్వ భవనంలో మరుగుదొడ్ల కూల్చివేతకు సంబంధించి తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కూల్చివేతకు తప్పనిసరిగా సంబంధిత శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. మరుగుదొడ్లను కూల్చివేసేందుకు అనుమతి కావాలంటూ కూడా తమను ఎవరూ సంప్రదించలేదు.

– లక్ష్మారెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌, జడ్చర్ల

నిబంధనలకు పాతర..

ఏదైనా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసంచేసే ముందు సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండానే రూ.లక్షల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్లను కూల్చివేశారు. ఇక్కడ మళ్లీ మరుగుదొడ్లు నిర్మించేందుకు రూ.లక్షల నిధులు అవసరమవుతాయి. కూల్చడం.. నిర్మించడం కారణంగా ప్రజాధనం వృథా అవుతుంది. కాగా, ఈ భవనం మరమ్మతులకు రూ. 20లక్షల సీఎస్‌ఆర్‌ నిధులు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఆ నిధులతో మౌలిక సదుపాయాల పేరుతో ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తమకు సెట్విన్‌ అధికారులు అనుమతిచ్చారని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు పేర్కొంటూ మరుగుదొడ్లను కూల్చివేత పనులు చేపట్టారు. అయితే అనుమతికి సంబంధించిన పత్రాలను అడిగితే ఇవ్వలేక పోయారు. ఈ భవనాన్ని సెట్విన్‌కు స్వాధీనం చేయకముందే ఎలా అనుమతిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్వలాభం కోసమే కూల్చారా.. ఇంకా మరేదైనా కారణాలు ఉన్నాయా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కలెక్టర్‌ సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి శకటోత్సవం



ఎడ్లబండ్లతో చెన్నకేశవస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామంలో చెన్నకేశవస్వామి జాతరను పురస్కరించుకుని గురువారం శకటోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర వాహనాలతో దేవాలయం వద్ద ప్రదక్షిణలు చేశారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు దాసంగాలను పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, ఆలయ పరిసరాల్లో వెలసిన దుకాణాల వద్ద భక్తుల సందడి నెలకొంది. శుక్రవారం ఆలయం వద్ద వృషభరాజులచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్‌ తిరుపతయ్య, చక్రధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, రమేష్‌, జగన్నాథం, రాఘవారెడ్డి, రాము, రంజిత్‌ కుమార్‌ పాల్గొన్నారు.

కమనీయం.. సత్యనారాయణస్వామి కల్యాణం



రమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

జడ్చర్ల టౌన్‌: పట్టణంలో రమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ వార్షిక ఉత్సవాలను పురస్కరించుకొని ఉదయం సుప్రభాత సేవలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. జీవతత్వ, ప్రాణ, కళాన్యాస, మూలమంత్ర హోమాలతో పాటు ఆంజనేయస్వామి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామికి తమలపాకుల అర్చన, నాగవల్లి దళార్చన జరిపించారు. అనంతరం కల్యాణ మండపంలో రమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి.. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణతంతు జరిపారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి రథోత్సవం, పవళింపుసేవ నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చిన్నారుల్లో నులిపురుగులను నిర్మూలిద్దాం



జడ్చర్ల మున్సిపల్‌ కార్యాలయంలో సమావేశమైన మండల టాస్క్‌ఫోర్స్‌ కమిటీ సభ్యులు



నవాబుపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్‌ శ్రీనివాస్‌

జడ్చర్ల టౌన్‌: చిన్నారుల్లో రక్తహీనత, అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగులను నిర్మూలించేందుకు గాను ఆల్బెండజోల్‌ మాత్రలు వేయాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ కోనేటి పుష్పలత సూచించారు. ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మున్సిపల్‌ కార్యాలయంలో మండల టాస్క్‌ఫోర్స్‌ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్‌ మాత్రల పంపిణీపై చర్చించారు. 1–19 ఏళ్లలోపు పిల్లలందరికీ మాత్రలు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్‌ కమిషనర్‌ లక్ష్మారెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్‌ మనుప్రియ, ఆర్‌బీఎస్‌కే డా.సునీల్‌, కౌన్సిలర్‌ విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి..

నవాబుపేట: చిన్నారుల్లో నులిపురుగులతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్‌ శ్రీనివాస్‌, ఎంపీడీఓ జయరాంనాయక్‌ అన్నారు. నవాబుపేట పీహెచ్‌సీలో డాక్టర్‌ శ్రావణ్‌కుమార్‌ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 1–19 ఏళ్లలోపు చిన్నారులందరికీ ఆల్బెండజోల్‌ మాత్రలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. సమావేశంలో ఎంఈఓ నాగ్యానాయక్‌, వైద్యసిబ్బంది బాలమ్మ, శ్రీనివాస్‌, విజయ, జయశీల, రాఘవేందర్‌, శరభలింగం, శ్రీనివాస్‌, భవానీ సింగ్‌ ఉన్నారు.

తీరిన తాగునీటి సమస్య



రాజాపూర్‌: మండలంలోని మల్లెబాయితండా, మోత్కులకుంట తండాలకు మిషన్‌ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి తెలియజేయడంతో గురువారం బోరుడ్రిల్లింగ్‌ చేయించారు. తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు ఆయా తండాల గిరిజనులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు శ్రీనివాస్‌ నాయక్‌, నరహరి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి రమేష్‌ పాల్గొన్నారు.

'గణతంత్ర మొగ్గలు' ఆవిష్కరణ



స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: ప్రముఖ కవి, రచయిత డా. భీంపల్లి శ్రీకాంత్‌ రచించిన 'గణతంత్ర మొగ్గలు' పుస్తకాన్ని గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ ఎ.ప్రవీణ్‌కుమార్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు నిండిన సందర్భంగా ఈ పుస్తకాన్ని రచించడం అభినందనీయమని అన్నా రు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్‌, సీఎంఓ బాలుయాదవ్‌ పాల్గొన్నారు.

ఖాళీ చెక్కు చోరీ

- రూ.50వేలు కాజేసిన దుండగుడు
- చీటింగ్‌ కేసు నమోదు

మహబూబ్‌నగర్‌ క్రైం: బ్యాంకులో చెక్కు ద్వారా డిపాజిట్‌ చేయడానికి వచ్చిన వ్యక్తికి ఓ దండగుడు సహాయం చేస్తానని నమ్మబలికి.. బాధితుడి సంతకం ఉన్న ఖాళీ చెక్కును కాజేశాడు. ఆ తర్వాత రూ. 50వేలను తన ఖాతాలో జమ చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్‌ సీఐ అప్పయ్య వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌ నగర్‌కు చెందిన రిటైర్డ్‌ అధికారి మారెపల్లి పరశురాములు తన చెక్కులను అకౌంట్‌లో జమ చేసేందుకు ఈ నెల 3న క్లాక్‌టవర్‌ ఏరియాలో ఉన్న ఎస్‌బీఐ మెయిన్‌ బ్రాంచ్‌కు వెళ్లాడు. అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి తాను చెక్కులను రాసి ఇస్తానని పరశురాములును నమ్మించాడు. చెక్కు బుక్కులో మూడు చెక్కులను రాసిన తర్వాత బాధితుడి సంతకంతో ఉన్న ఖాళీ చెక్కును అపహరించాడు. ఆ చెక్కు ద్వారా ఈ నెల 5న కడపలో తన బ్యాంకు ఖాతాలో రూ. 50వేలను డిపాజిట్‌ చేశాడు. అయితే అనుమానం వచ్చిన బాధితుడు.. బ్యాంక్‌కు వెళ్లి తన చెక్కులను ఏ ఖాతాలో జమ చేశారని ఆరా తీయగా.. కడపకు చెందిన జి.ప్రభాకర్‌ అనే వ్యక్తి అకౌంట్‌లో జమ అయినట్లు తేలింది. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రభాకర్‌పై చీటింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వెల్లడించారు. బ్యాంకుల వద్ద గుర్తుతెలియని వ్యక్తులకు చెక్కు బుక్‌లు, ఏటీఎం కార్డులు ఇవ్వరాదని తెలిపారు.

అధునాతన పద్ధతులపై అవగాహన అవసరం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌ (వ్యవసాయం): వ్యవసాయంలో అధునాతన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అగ్రికల్చర్‌ ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ నూతన సంవత్సర క్యాలెండర్‌, డైరీని గురువారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న రైతు రుణమాఫీ, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇతర సంక్షేమ పథకాలను రైతులకు వివరించాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉంటూ.. పంటల సాగుపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ యశ్వంత్‌రావు, వ్యవసాయాధికారులు ప్రత్యూష, రాంపాల్‌, అనిల్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న చెన్నకేశవస్వామి ఆలయ ధర్మకర్త గౌని చెన్నారెడ్డి

అడ్డాకుల: క్రీడలు స్నేహభావం పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఉల్లాసం కలిగిస్తాయని రాచాల చెన్నకేశవస్వామి ఆలయ ధర్మకర్త గౌని చెన్నారెడ్డి అన్నారు. రాచాలలో చెన్నకేశవస్వామి జాతరను పురస్కరించుకొని రెండు రోజులపాటు నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వాలీబాల్‌ పోటీలు గురువారం ముగిశాయి. టోర్నీలో మొత్తం 23 జట్లు పాల్గొనగా.. వనపర్తి జిల్లా మదనాపురం జట్టు కొత్తకోట మండలం కానాయపల్లి జట్టుపై గెలుపొంది విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ఆలయ ధర్మకర్త చెన్నారెడ్డి నగదు బహుమతులను అందజేశారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ పాశం తిరుపతయ్య యాదవ్‌, రవీందర్‌రెడ్డి, జనార్దన్‌, మాధవరెడ్డి, చక్రపాణిరెడ్డి, రాజగౌడ్‌, రాము, బొక్క శ్రీను, జగన్‌ పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలకు న్యాయం చేయాలి



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): గత ప్రభుత్వం రెగ్యులర్‌ ఏఎన్‌ఎం పోస్టుల భర్తీ కోసం విడుదల చేసిన ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ నోటిఫికేషన్‌ను సవరించి రెండో ఏఎన్‌ఎంలకు న్యాయం చేయాలని తెలంగాణ మెడికల్‌ కాంట్రాక్ట్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్‌ కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌ ఎదుట రెండో ఏఎన్‌ఎంలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లుగా సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా రెండో ఏఎన్‌ఎంలు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. రెగ్యులర్‌ ఏఎన్‌ఎంల పోస్టుల్లో రెండో ఏఎన్‌ఎంలను భర్తీచేసి, వంద శాతం గ్రాస్‌ శాలరీ అమలుచేయాలని డిమాండ్‌ చేశారు. గత ప్రభుత్వం రెండో ఏఎన్‌ఎంలకు తీరని అన్యాయం చేయడంతో పలు దఫాలుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. 2023లో రెండో ఏఎన్‌ఎంల సమస్యలపై త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సెకండ్‌ ఏఎన్‌ఎంల సమస్యలను పరిశీలించి.. న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు. రెండో ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈ నెల 17నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఎంహెచ్‌ఓ కృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో సెకండ్‌ ఏఎన్‌ఎం యూనియన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయమ్మ, జిల్లా అధ్యక్షురాలు గిరిజారెడ్డి, ఎల్లమ్మ, భాగ్య, సుజాత, శోభారాణి, అంజమ్మ, కృష్ణవేణి, జానకి, చంద్రకళ, సుగుణమ్మ, రేణుక, సునీత, శ్రీదేవి, రాణి, లక్ష్మి పాల్గొన్నారు.

శెభాష్‌.. జస్మిత



బాధితురాలికి ఫోన్‌ అందజేస్తున్న చిన్నారి జస్మిత

దేవరకద్ర రూరల్‌: నేలపై రూ. 10 కనిపిస్తే చాలు టక్కున తీసుకుని జేబులో పెట్టుకునే మనుషులు ఉన్న ఈ రోజుల్లో.. తనకు దొరికిన ఓ ఫోన్‌ను పోలీసుల సహాయంతో బాధితురాలికి అప్పగించి తన నిజాయితీ చాటుకుంది ఓ చిన్నారి. వివరాల్లోకి వెళ్తే.. దేవరకద్రకు చెందిన చిన్నారి జస్మిత గురువారం తన తండ్రి నర్సింహాతో కలిసి క్రికెట్‌ కోచింగ్‌ నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్తుండగా.. దేవరకద్రలోని పెట్రోల్‌బంక్‌ సమీపంలో రోడ్డు పక్కన రూ. 15వేల విలువైన మొబైల్‌ ఫోన్‌ పడి ఉండటం గమనించింది. ఫోన్‌ తీసుకుని వెంటనే స్థానిక ఎస్‌ఐ నాగన్న వద్దకు వెళ్లి.. ఫోన్‌ పోగొట్టుకున్న వారికి తిరిగి అప్పగించాలని కోరింది. ఈ మేరకు పోలీసులు ఫోన్‌ పోగొట్టుకున్న బాధితురాలిని గుర్తించి.. చిన్నారి జస్మిత చేతుల మీదుగా ఫోన్‌ అప్పగించారు.

పీయూ విద్యార్థులకు బహుమతులు



బహుమతులు పొందిన విద్యార్థులతో పీయూ అధ్యాపకులు

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహించిన సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాల్లో పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులు నాలుగు బహుమతులను సాధించారు. కవి సమ్మేళనం, కోలాటం, జానపద పాటలు, చిత్రలేఖనం తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు పొందిన విద్యార్థులను పీయూ వీసీ శ్రీనివాస్‌, రిజిస్ట్రార్‌ చెన్నప్ప, హెచ్‌ఓడీ సంధ్యారాణి, మన్నెమోని కృష్ణయ్య, రవీందర్‌గౌడ్‌ అభినందించారు.

సింథటిక్‌ కెమికల్‌ ప్లాంట్‌ నిలిపేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

మరికల్‌: చిత్తనూర్‌ ఇథనాల్‌ కంపెనీలో ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కొత్తగా సింథటిక్‌ కిమికల్స్‌ అనే అమోనియం ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఇథనాల్‌ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు గురువారం తహసీల్దార్‌ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్‌ రాఘవాచారి మాట్లాడుతూ ఇప్పటికే ఇథనాల్‌ ఉత్పత్తి వల్ల విపరీతమైన దుర్వాసన వస్తోందని, అదనంగా కొత్తగా సింథటిక్‌ కిమికల్స్‌ అనే అమోనియం ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే ప్రజలకు ప్రమాదకరమైన వ్యాధుల వచ్చే అవకాశం ఉందన్నారు. గతంలో కంపెనీ రద్దు కోసం పోరాటం చేసిన వారిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయించాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌, చక్రవర్తి, తిమ్మప్ప, రాంచంద్రయ్య, యదగిరి, సరోజనమ్మ, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.